RNI No. APTEL/2010/ 36692 AKSHARA PRAKASAM aksharaprakasam@gmaiil.com

అక్షర ప్రకాశం

Published From Prakasam People News Paper

సంపుటి : 15 సంచిక : 293 సెప్టెంబర్ 10 గురువారం 2026 ప్రకాశం పేజీలు : 4 వెల - 2

ప్రతి వారం

ప్రజల మధ్యనే ఉంటా

- కోనసీమ జిల్లాలో 'మీ భూమి - మీ హక్కు' గ్రామసభ
- సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్న చంద్రబాబు
- గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దుతూ రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన
- 16 లక్షల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించినట్టు వెల్లడి
- భూమికి పూర్తి భద్రత కల్పించేలా రాజముద్రతో కొత్త పాస్ పుస్తకాలు
- రూ.240 కోట్లతో ఈపీడీసీఎల్ గ్రిడ్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన

సెప్టెంబర్ 9 : సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు మూల మంత్రాలతోనే కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సచివాలయానికి పరిమితమై పనిచేయడం కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల మధ్య ఉంటూ వారి జీవితాల్లో వెలుగులు నింపడమే అసలైన సుపరిపాలన అని, దానికోసం తమ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని ఉద్ఘాటించారు. కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గంలోని మాచడవ పండువారిపేటలో బుధవారం నిర్వహించిన 'మీ భూమి - మీ హక్కు' గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి వారం ప్రజల వద్దకే వస్తున్నానని, వారి బాగోగులు తెలుసుకుంటూ పాలన సాగిస్తున్నానని తెలిపారు. ప్రతినెలా ఒకటో తేదీన పేదల వద్దకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందిస్తూ వారి కష్టసుఖాలను తెలుసుకుంటున్నానని సీఎం గుర్తుచేశారు. అలాగే, ప్రతి నెలా మూడో శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం లో, నాలుగో శనివారం పీ4 (ప్రజలు, ప్రైవేట్, ప్రభుత్వ భాగస్వామ్యం) కార్యక్రమంలో పాల్గొంటూ ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి జరిగితేనే సంపద సృష్టి జరుగుతుందని, తద్వారా ప్రజలంతా గౌరవంగా జీవించేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

భూమికి భద్రత.. గత ప్రభుత్వ పాపాల ప్రక్షాళన

ప్రతి నెలా 9వ తేదీన 'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమం ద్వారా రైతులకు, యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని సీఎం తెలిపారు. భూమిపై యజమానులకు తిరుగులేని హక్కులు కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత పాలకులు తమ ఐదేళ్ల పాలనలో రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేశారని, రికార్డులను తారుమారు చేసి ఘోరాలు, నేరాలు, పాపాలు చేశారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో ప్రజల భూములను కాజేసేందుకు కుట్ర పన్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ ప్రమాదకర చట్టాన్ని రద్దు చేసి ప్రజలకు భరోసా ఇచ్చిందని గుర్తుచేశారు.

"రీసర్వే పేరుతో గత ప్రభుత్వం చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన భూములపై కూడా తమ ఫొటోలు వేసుకున్నారు. సర్వే రాళ్లపై బొమ్మలు వేసుకునే పిచ్చి ఏమిటో ఎవరికీ అర్థం కాలేదు. తమకు ఇష్టం లేని వ్యక్తుల భూములను, ఆస్తులను 22ఏ జాబితాలో చేర్చి వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. అందుకే ఇప్పుడు పటిష్ఠమైన రీసర్వే ప్రక్రియను పూర్తి చేసి, ఎక్కడా అవకతవకలకు తావులేకుండా బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, ఈ-కేవైసీ, క్యూఆర్ కోడ్ వంటి భద్రతా ఫీచర్లతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నాం"అని చంద్రబాబు వివరించారు.

రికార్డు స్థాయిలో రెవెన్యూ సంస్కరణలు

భూమికి సంపూర్ణ భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ అజెండా అని సీఎం స్పష్టం చేశారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 8,234 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి, 36 లక్షల మందికి రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు అందించామని తెలిపారు. వచ్చే ఏడాది మార్చి నాటికి మిగిలిన 8,582 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి మొత్తం 56 లక్షల పాస్ పుస్తకాలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రిజిస్ట్రేషన్ జరిగిన వెంటనే ఆటో మ్యూటేషన్ సేవలు అందుబాటులోకి తెచ్చామని, వారసత్వ భూముల విభజనలో స్టాంప్ డ్యూటీని కేవలం రూ.1000కి పరిమితం చేయడం ద్వారా 1.25 లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చామని చెప్పారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతూ రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల ఎకరాలను 22ఏ జాబితా నుంచి తొలగించి లక్షలాది మందికి ఊరట కల్పించామని అన్నారు. శెట్టిపల్లి కంగుంది, వట్టిచెరుకూరు, ముదినేపల్లి వంటి ప్రాంతాల్లో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న 244 కీలక భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించామని తెలిపారు. అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రాపురంలో బ్రిటిష్ కాలం నాటి (1908) 22ఏ(1) నిషేధిత భూముల సమస్యను కూడా పరిష్కరిస్తున్నామని, దీని ద్వారా 1410 మందికి చెందిన 56.37 ఎకరాల భూమికి విముక్తి కల్పిస్తున్నామని ప్రకటించారు. "గొడ్డలి పార్టీ తారుమారు చేసిన రికార్డులను ప్రక్షాళన చేసి భూ సమస్యలను కొలిక్కి తెస్తున్నాం" అని ఆయన వ్యాఖ్యానించారు.

ప్రజల సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యం

భూమి భద్రతతో పాటు నీటి భద్రతకు కూడా తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సీఎం అన్నారు. ఈ ఏడాది తీవ్రమైన ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ, గోదావరి నుంచి వెయ్యి టీఎంసీలకు పైగా నీరు సముద్రంలో వృథాగా కలిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకుల నిర్లక్ష్యం, రాజకీయ కక్షతో కాంట్రాక్టర్‌ను మార్చడం వల్లే పోలవరం డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయి ప్రాజెక్టు ఆలస్యమైందని ఆరోపించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు ఢిల్లీలో సంజీవనిలా పనిచేసిందని, కేంద్రం నుంచి రాష్ట్రానికి ఎక్కువ నిధులు తెచ్చుకోగలుగుతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా, తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) రూ.240 కోట్ల వ్యయంతో చేపట్టిన గ్రిడ్ ఆధునీకరణ, 3-ఫేజ్ విద్యుత్ సరఫరా పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

'పాడనా తెలుగు పాట' పోటీలు: - 16 ఏళ్ల లోపు పిల్లలకు ఆహ్వానం

ఒంగోలు, అక్షర ప్రకాశం : ఆంధ్ర సారస్వత పరిషత్తు (ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో డిసెంబర్ 5, 6 తేదీల్లో ఒంగోలులోని 'నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్' ప్రాంగణంలో "నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలు - బాలలు" వైభవంగా జరగనున్నాయి. ఈ మహాసభల్లో భాగంగా 'దివ్యశ్రీ డా. భానుమతి రామకృష్ణ వేదికపై 16 ఏళ్ల లోపు బాలబాలికలకు 'పాడనా తెలుగు పాట' అనే కరాయోకే గీతాల పోటీని నిర్వహిస్తున్నట్లు పరిషత్ అధ్యక్షులు డా. గజల్ శ్రీనివాస్ తెలిపారు.

పోటీ వివరాలు & నిబంధనలు:

అర్హత: 16 సంవత్సరాల లోపు ఉన్న బాలబాలికలు.

మాధ్యమం: కరాయోకే పద్ధతిలో పాటలు పాడాల్సి ఉంటుంది.

పాటల రకం: తెలుగు సాహిత్యం, సంగీత విలువలు ఉన్న పాటలను మాత్రమే ఎంచుకోవాలి. అశ్లీలమైన లేదా జాతీయ సమైక్యతకు భంగం కలిగించే పాటలకు అనుమతి లేదు.

ప్రాథమిక ఎంపిక: పోటీదారులు కరాయోకే ద్వారా రెండు పాటలను రికార్డ్ చేసి, సెప్టెంబర్ 30 లోపు srividyajv8@gmail.com అనే ఈమెయిల్ ద్వారా శ్రీమతి జొన్నలగడ్డ వల్లి శ్రీవిద్యకు పంపించాలి.

ఫలితాలు: ప్రాథమిక పరిశీలనలో ఎంపికైన వారికి అక్టోబర్ 15 లోపు సమాచారం అందిస్తారు.

ముఖ్య వేదికపై: ఎంపికైన పోటీదారులు ప్రధాన వేదికపై సోలో (ఒంటరిగా) మరియు యుగళ (డ్యూయెట్) గీతాలను ఆలపించాల్సి ఉంటుంది.

సౌకర్యాలు & బహుమతులు:

ఎంపికైన అభ్యర్థులకు నిర్వాహకులు స్థానిక డార్మిటరీ వసతి మరియు రవాణా సౌకర్యాన్ని కల్పిస్తారు. అలాగే వేదికపై విజేతలను ప్రశంసా పత్రం, శాలువా మరియు పతకంతో ఘనంగా సత్కరించనున్నట్లు కార్యదర్శి శ్రీ రెడ్డప్ప ధవేజీ, సమన్వయకర్తలు డా. ఖ. మురళీధర్ రెడ్డి, కోగంటి శ్రీకాంత్ తెలిపారు. మరిన్ని వివరాల కోసం డా. గజల్ శ్రీనివాస్ (ఫోన్ నెంబర్: 9849013697) ను సంప్రదించవచ్చు.

జిల్లాలో 52 పరిశ్రమల ఏర్పాటుకు ప్రతిపాదనలు

ఒంగోలు, అక్షర ప్రకాశం : జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వేగంగా చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు తెలిపారు. బుధవారం అమరావతి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ నిర్వహించిన వీడియో సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లాల్లో పరిశ్రమల ఏర్పాటు, ఎంఎస్ఎంఈ పార్కుల అభివృద్ధిపై జిల్లా కలెక్టర్లతో ప్రధాన కార్యదర్శి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా బిజినెస్ సమ్మిట్ ద్వారా సుమారు రూ.300 నుంచి రూ.400 కోట్ల మేర పెట్టుబడులకు సంబంధించి అవగాహన ఒప్పందాలు జరిగినట్లు తెలిపారు. 52 పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను పరిశ్రమల శాఖ కార్యదర్శికి పంపినట్లు వివరించారు.

జిల్లాలోని స్థానిక పారిశ్రామికవేత్తలు కొత్త పరిశ్రమల స్థాపనకు ఆసక్తి చూపుతున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం పలు చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రస్తుతం నాలుగు పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడిదారులు ప్రత్యేక ఆసక్తి చూపుతున్నట్లు తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జరిగిన ఈ వీడియో సమావేశంలో కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మదన్ మోహన్, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చేయని తప్పుకు చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారు

- ఆ రోజే వైసీపీ పతనం ప్రారంభమైంది

- మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

- చంద్రబాబు అక్రమ అరెస్ట్ కు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా కొండపిలో కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపిన మంత్రి డా. స్వామి

కొండపి, అక్షర ప్రకాశం : చంద్రబాబు అక్రమ అరెస్ట్ కు నేటితో మూడేళ్లు పూర్తయిన సందర్భంగా కొండపిలో కొవ్వొత్తులు వెలిగించి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలుగు ప్రజలందరికీ నేడు చీకటి రోజు, సరిగ్గా 3 ఏళ్ల క్రితం ఇదే రోజున చేయని తప్పుకు నంద్యాల పర్యటనలో ఉన్న చంద్రబాబుని అక్రమ అరెస్టు చేశారు. ఆ రోజే వైసీపీ పతనం ప్రారంభమైంది. చంద్రబాబు అక్రమ అరెస్టు నిరసిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలు నిరసనలు తెలిపారు. జగన్ ఎన్ని కుట్రలు చేసినా కడిగిన ముత్యంలా చంద్రబాబు జైలు నుంచి బయటకి వచ్చారు. ఎప్పటికైనా నిజం గెలుస్తుందనేదానికి ఇదే నిదర్శనం. చంద్రబాబు అక్రమ అరెస్ట్ తోనే ప్రజలు వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా లేకుండా ఫ్యాన్ రెక్కలు విరిచారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

ఆర్యవైశ్య జర్నలిస్టులకు ఘన సన్మానం

మార్కాపురం, అక్షర ప్రకాశం : వాసవి క్లబ్ వ్యవస్థాపకులు, స్వాతంత్ర్య సమరయోధులు స్వర్గీయ కే.సీ. గుప్తా గారి 107వ జయంతి వారోత్సవాల్లో భాగంగా ఆరో రోజు ఆర్యవైశ్య జర్నలిస్టులకు ఘన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వి-207 ఏ గవర్నర్ సూరే సురేంద్ర, రీజియన్ చైర్మన్ సూరే కేశవరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్యవైశ్య జర్నలిస్టులను ఘనంగా సన్మానించి, సమాజానికి వారు అందిస్తున్న సేవలను అభినందించారు. కార్యక్ర మంలో పాల్గొని వారు జోన్ చైర్మన్ కందూరి రవి వాసవి క్లబ్ అధ్యక్షుడు బైసాని కోటేశ్వరరావు, కార్యదర్శి గెల్లి ప్రసాద్, వనితా క్లబ్ ప్రెసిడెంట్ టంగుటూరి దివ్యతేజ, కోశాధికారి మోదాల జ్యోతి, విజన్ క్లబ్ ప్రెసిడెంట్ కామిశెట్టి నవీన్, కార్యదర్శి కొత్తమాసు మురళీకృష్ణ, కోశాధికారి అన్నా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ వేగవంతం చేయాలి

- రీసర్వే ప్రక్రియలో జాప్యానికి తావివ్వొద్దు: జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి - భూ యజమానుల సమక్షంలోనే రీసర్వే నిర్వహించాలి - గ్రౌండ్ ట్రూతింగ్, ఈ-కేవైసీలో పురోగతి సాధించాలి - రెవెన్యూ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక సమీక్ష

ఒంగోలు, అక్షర ప్రకాశం : పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి అధికారులను ఆదేశించారు. కందుకూరు, అద్దంకి డివిజన్లకు చెందిన రెవెన్యూ, సర్వే శాఖ అధికారులతో బుధవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై ఆమె దిశానిర్దేశం చేశారు. గ్రౌండ్ ట్రూతింగ్, ఈ-కేవైసీ ప్రక్రియల్లో మరింత పురోగతి సాధించాలని సూచించారు. భూ యజమానుల సమక్షంలోనే రీసర్వే నిర్వహించాలని స్పష్టం చేశారు. భూములకు సంబంధించిన సమగ్ర వివరాలతో పట్టాదారు పాసుపుస్తకాలను అందించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, క్షేత్రస్థాయిలో అధికారులు కూడా అదే స్ఫూర్తితో పనిచేయాలని తెలిపారు. నిర్దేశించిన గడువు వరకు వేచి చూడకుండా రీసర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మండలాలవారీగా పురోగతిని సమీక్షిస్తూ, పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. మ్యుటేషన్ల ప్రక్రియ కూడా సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నిషేధిత 22(ఏ) జాబితాలో ఉన్న పట్టా భూములను పరిశీలించి, అర్హమైన వాటికి త్వరగా క్లియరెన్స్ ఇవ్వాలని సూచించారు. 'మీకోసం' కార్యక్రమం ద్వారా అందుతున్న రెవెన్యూ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎక్కువ అర్జీలు వస్తున్న మండలాలపై వచ్చే వారం నుంచి ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామని జాయింట్ కలెక్టర్ ప్రకటించారు. ఈ సమావేశంలో కందుకూరు సబ్ కలెక్టర్ డి. హిమవంశీ, డీఆర్వో పి. వెంకటరమణ, అద్దంకి ఆర్డీవో విజయజ్యోతి కుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాధురి, సర్వే శాఖ సహాయ సంచాలకులు రమణ, తహసీల్దారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు చీకటి రోజును గుర్తు చేసుకుంటూ కొవ్వొత్తుల ప్రదర్శన

- చంద్రబాబు అరెస్టుకు మూడేళ్లు.. కొవ్వొత్తుల ప్రదర్శన
- ఎన్టీఆర్ విగ్రహం ఎదుట టీడీపీ నాయకుల నివాళి
- నిజం గెలిచిందన్న కనగాల శ్రీనివాసరావు
- ఉప్పుగుండూరులో కూటమి నాయకుల సంఘీభావం

నాగులుప్పలపాడు, అక్షర ప్రకాశం : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును గతంలో అరెస్టు చేసిన ఘటనకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు ఉప్పుగుండూరులో బుధవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. గ్రామంలోని నందమూరి తారక రామారావు విగ్రహం ఎదుట గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కనగాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టీడీపీ, కూటమి నాయకులు కొవ్వొత్తులతో ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా కనగాల శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అరెస్టు సమయంలో రాష్ట్ర ప్రజలతో పాటు దేశవిదేశాల్లోని తెలుగు ప్రజలు ఆయనకు సంఘీభావంగా నిలిచారని పేర్కొన్నారు. చివరకు నిజం గెలిచి చంద్రబాబు నిర్దోషిగా నిలిచారని అన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చి చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని, ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ దిశగా ముందుకు సాగుతోందని తెలిపారు. గతంలోని చీకటి రోజులు తిరిగి రాకూడదని కోరుకుంటున్నట్లు చెప్పారు. కొవ్వొత్తుల ప్రదర్శనలో మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు కూతంబాకం సెల్వం, టీడీపీ సోషల్ మీడియా నియోజకవర్గ ఇన్‌చార్జి బెల్లం వెంకటేశ్వర్లు, యూనిట్ ఇన్‌చార్జి కుంచాల నాగరాజు, కొప్పర్తి నాగయ్య, మసిముక్కు భాస్కరరావు, గద్దె త్యాగరాజు, ఉప్పుగుండూరు లక్ష్మీనారాయణ, కత్తి నాగార్జున, పిన్నక శ్రీకాంత్, కొండ శ్రీనివాసరావు, గద్దల రమేష్, జనసేన మండల కార్యదర్శి నిడికొండ వెంకట్‌తో పాటు సాదినేని ఆంజనేయులు, గుమ్మడి వెంకటేశ్వర్లు, బెల్లం హరిబాబు, కొండేటి జలంధర్, బెల్లం శ్రీనివాసరావు, సింగరయ్య, శవనం వసంతరావు, కొంజేటి రామకృష్ణ, జూపూడి బాబూరావు, యేనిగండ్ల వెంకన్న తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోంది

- మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి
- ప్రకాశం జిల్లా కొండపి మండలం నెన్నూరుపాడులో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేసిన మంత్రి డా.స్వామి

కొండపి, అక్షర ప్రకాశం : రైతు సంక్షేమమే ద్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం కొండపి మండలం నెన్నూరుపాడులో నిర్వహించిన "మీ భూమి - మీ హక్కు" కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నూతన పట్టాదారు పాసుపుస్తకాలను ఆయన స్వయంగా పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..పబ్లిసిటీ పిచ్చితో నాడు జగన్ పాసు పుస్తకాలపై తమ బొమ్మ వేసుకొని ప్రజాధనం దుర్వినియోగం చేశారు. నేడు రాజముద్రతో రైతులకు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తున్నాం. రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోంది. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు పంపిణీ చేస్తున్నాం, సబ్సిడీకి వ్యవసాయ యంత్ర పరికరాలు, డ్రోన్లు అందిస్తున్నాం. అన్నదాత సుఖీభవతో దేశంలో ఎక్కడా లేనివిధంగా పెట్టుబడి సాయం కోసం ఏడాదికి రూ. 20 వేలు ఇస్తున్నాం. అన్న దాతల ముఖాల్లో చిరునవ్వులే లక్ష్యంగా సీఎం చంద్రబాబు రైతు సంక్షేమానికి పాటు పడుతున్నారు. ఎల్ నినో పరిస్థితుల్ని రైతులకు అర్థం చేసుకోవాలి. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తున్నాం. సూపర్ సిక్స్ ని సూపర్ హిట్ చేశాం. ప్రజలంతా కూటమి ప్రభుత్వాన్ని నిండు మనసుతో ఆశీర్వదిస్తున్నారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

నిజం గెలిచింది.. 53 దీపాలతో స్మారక కార్యక్రమం

- ఒంగోలు పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహణ
- 53 రోజుల నిర్బంధానికి గుర్తుగా 53 దీపాలు
- ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహణ - పెద్ద సంఖ్యలో పాల్గొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు
- దీపాలు, కొవ్వొత్తులతో సంఘీభావ ప్రదర్శన - ఒంగోలు పార్టీ కార్యాలయంలో ఘనంగా కార్యక్రమం

ఒంగోలు, అక్షర ప్రకాశం : సెప్టెంబరు 2023 సెప్టెంబరు 9న అప్పటి ముఖ్యమంత్రి, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టు, అనంతరం 53 రోజుల నిర్బంధం, అక్టోబరు 31న రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి విడుదలైన ఘటనలకు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా టీడీపీ రాష్ట్రవ్యాప్తంగా 'నిజం గెలిచింది' పేరుతో స్మారక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఒంగోలు నగరంలో బుధవారం సాయంత్రం పార్టీ శ్రేణులు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఒంగోలు నగరంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 53 రోజుల నిర్బంధానికి గుర్తుగా 53 దీపాలను వెలిగించారు. పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కొవ్వొత్తులు, దీపాలు వెలిగిస్తూ సంఘీభావం తెలిపారు. 'నిజం గెలిచింది' అంటూ నినాదాలు చేస్తూ కార్యక్రమాన్ని నిర్వహించారు. 2023 సెప్టెంబరు 9 నుంచి అక్టోబరు 31 వరకు జరిగిన పరిణామాలను గుర్తు చేసుకుంటూ పార్టీ శ్రేణులు ఈ స్మారక కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ప్రజల్లో రాజకీయ చైతన్యం, ప్రజాస్పందనను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో కార్యక్రమాన్ని చేపట్టినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు నగర కమిటీ సభ్యులు, క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లు, డివిజన్, గ్రామ కమిటీల అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పార్టీ కార్యాలయ ప్రాంగణంలో దీపాలతో ప్రత్యేక వాతావరణం నెలకొంది. పలువురు నాయకులు 53 రోజుల నిర్బంధాన్ని గుర్తు చేసుకుంటూ దీపాలను వెలిగించారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా పార్టీ శ్రేణుల్లో ఐక్యతను చాటుతూ, 'నిజం గెలిచింది' అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు పేర్కొన్నారు. భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనడంతో కార్యక్రమం విజయవంతంగా సాగింది.

చిమ్మిరి బాలకృష్ణ
టీడీపీ నాయకులు 46 డివిజన్

బెజవాడ ఆంజనేయులు
14వ డివిజన్ అధ్యక్షుడు

Published by : Byrapuneni Srinivasarao, Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. , Printed by : Nannuri Subba Rao, Trunk Road, Ongole Town & Mandal, Prakasam Dist, A.P. - 523001, Printed at : Vijaya Printers (offset Printing), Trunk Road, Ongole Town & Mandal, Prakasam Dist, A.P. - 523001, Published from : Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. Editor : Byrapuneni Srinivasarao, Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. Cell : 9848997263, E.mail : aksharaprakasam@gmail.com,